క్లుప్తంగా

న్యూడెమోక్రసీ నుంచి కారింగుల వెంకన్న సస్పెన్షన్



మాట్లాడుతున్న నాగయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట): న్యూడెమోక్రసీ నుంచి డివిజన్ నాయకుడు కారింగుల వెంకన్నను సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారింగుల వెంకన్న గత కొంత కాలం నుంచి పార్టీకి సంబంధం లేకుండా ఉంటున్నాడని, డబ్బుల లావాదేవీల విషయాల్లో పంచాయితీలు చేస్తున్నట్లు పార్టీ దృష్టికి వచ్చిందని తెలిపారు. అందుకే పార్టీ నుంచి అతడిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, డివిజన్ నాయకులు కాకి మోహన్ రెడ్డి, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు పోలేబోయిన కిరణ్, డివిజన్ నాయకులు సంపేట కాశయ్య, దేసోజు మధు, పోరెండ్ల దశరథ, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా నాగం జయసుధ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగం జయసుధ

నూతనకల్: మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన నాగం జయసుధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని సంఘం సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు విచారించిన అధికారులు చైర్మన్ పదవితో పాటు సంఘం సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు సీఈఓ సమ్మెట వెంకన్న తెలిపారు. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగం జయసుధ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కాసోజు మదనాచారి, తొట్ల లక్ష్మయ్య, ఏలేటి నారాయణరెడ్డి, మట్టపల్లి లింగయ్య, మాతంగి వెంకన్న, గాడ్దుల లింగయ్య, పసుల వెంకన్న, జానకి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నీటి విడుదల నిలిపివేత

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు వస్తున్న గోదావరి నీటి విడుదలను బుధవారం నిలిపివేశారు. ఈ నెల 8న గోదావరి జలాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కొడకండ్ల వద్ద విడుదల చేశారు. వారం రోజులు పూర్తి కావడంతో నిలిపివేశారు. తిరిగి ఈనెల 23నుంచి 30 వరకు నీటిని ఇవ్వనున్నట్లు నీటి పారుదల శాఖ ఏఈ అమర్ తెలిపారు.

మత్స్యకార్మిక కుటుంబానికి ఆర్థికసాయం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడేనికి చెందిన మూసీ ప్రాజెక్టు మత్స్యకార్మిక సంఘం మాజీ డైరెక్టర్ ఈదుల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి బుధవారం బీఆర్‌ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ.22,200 ఆర్థికసాయం అందజేశారు. వారిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, కొప్పుల సోమిరెడ్డి, కుంభం నాగరాజు, పున్న హరిప్రసాద్, బి.వెంకన్న, బి.వీర సోములు, పెద్ది శ్రీనివాస్, లొడంగి నాగరాజు, ఎం.యాదయ్య, రామ్మూర్తి, యాగానందం, సురేష్ తదితరులున్నారు.

ఎన్టీఆర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో..

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్ మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఉయ్యాల లింగయ్య ఇటీవల శబరిమలకు ఇరుముడుల కోసం వెళ్లి గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఎన్టీఆర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో రూ.17,500ల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. వారిలో కొడదల లక్ష్మణ్, వరికుప్పల వీరేష్, ఓర్సు లింగరాజు, నల్లగొండ వీరన్న, వరికుప్పల ఏడుకొండలు, వరికుప్పల ఎల్లయ్య, కనకయ్య, అనిల్, ప్రశాంత్, రవి, నవీన్, అంజయ్య తదితరులున్నారు.

తోటి విద్యార్థుల ఆర్థికసాయం

అర్వపల్లి: మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో పర్సాయపల్లి, బొల్లంపల్లి గ్రామాలకు చెందిన అతడి తోటి విద్యార్థులైన 2011–2012 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు బాధిత కుటుంబానికి బుధవారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. వారిలో మర్యాద సంతోష్, సంతు, హస్సేన్, సైదులు, నాగరాజు, సందీప్, సురేందర్, జాని ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న విద్యార్థులు

భారంగా ‘మధ్యాహ్నం’ నిర్వహణ



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ మహిళలు

- పెరిగిన నిత్యావసర సరుకులు, కోడిగుడ్ల ధరలు
- సక్రమంగా విడుదల కాని నిధులు
- తీవ్రంగా నష్టపోతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిర్వహణ ఏజెన్సీలకు భారంగా మారింది. నిత్యావసర సరుకుల ధరలు, కోడిగుడ్లు, కూరగాయల ధరలు పెరుగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఏజెన్సీలకు నెలనెలా బిల్లులు సక్రమంగా రాక నిర్వాహకులు అప్పుల్లో మునుగుతున్నారు. ముందు ఖర్చులు పెట్టి.. ఆతర్వాత బిల్లుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తే పెరిగిన ధరల ప్రకారం ప్రతిరోజు రూ.1000కి పైగానే అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదల నేపథ్యంలో మెనూ కూడా సక్రమంగా పాటించలేని పరిస్థితి నెలకొంటుంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి పిల్లలకు రూ.5.45, 6 నుంచి 8వ తరగతి పిల్లలకు ఒక్కొక్కరికి రూ.8.17 చొప్పున ప్రభుత్వం కేటాయించింది. వీరికి గుడ్డుతో భోజనం పెడితే ఆరోజు అదనంగా రూ.5 ఒక్కో విద్యార్థికి చెల్లిస్తారు. అయితే వీటి ధరలు పెరగడంతో నష్టపోతున్నారు. ఉన్నత పాఠశాలల్లో 9, 10వ తరగతులకు గుడ్డుతో సహా కలిపి రూ.10.47 చెల్లిస్తారు. ఇందులోనే వారంలో మూడు రోజులు వడ్డించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రూ.7కు పైగానే గుడ్డుకే సరిపోతే మిగిలిన రూ.3.47 పప్పు, ఇతర ఖర్చులకు ఎలా సరిపోతాయని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా అరటి పండ్ల ధరలు కూడా పెరిగాయి. డజను పండ్లు రూ.50 నుంచి రూ.60 ధర ఉన్నాయి. ఇలా ధరలు పెరగడంతో భోజనాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 2,200మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 32 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు వంటలు చేస్తున్నాయి. ఈ నిర్వాహకులంతా మధ్యాహ్న భోజన వంటలు చేసి పిల్లలకు నిత్యం భోజనాలు వడ్డిస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో తీవ్రంగా నష్టపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచాలని కోరుతున్నారు.

చార్జీలు పెంచితేనే వంటలు చేయగలం



నిత్యావసరాలకు అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజన వంటలు చేస్తున్నాం. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో వంటలు చేయలేని పరిస్థితి నెలకొంది. మాకు కోడిగుడ్డుకు అధికారులు రూ.5చెల్లిస్తుండగా బయట దుకాణాల్లో ఒక్కో గుడ్డు రూ.7కు పైగానే చెల్లించి పిల్లలకు అందిస్తున్నాం. కూరగాయల ధరలు కూడా పెరిగాయి. ప్రతినెలా వంటలకు నష్టమే తప్ప ఇంత వరకు పైస మిగలలేదు.

– అంకిరెడ్డి కళమ్మ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు

ప్రతినెలా బిల్లులు చెల్లించాలి



మధ్యాహ్న భోజన వంటలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలి. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఇంతవరకు ఒక్కపైసా బిల్లు రాలేదు. అప్పులు తెచ్చి వంటలు చేస్తున్నాం. రెండు రోజుల కిందటే 5 నెలల బిల్లులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు.

– సంధ్య, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు

పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణ పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీని బుధవారం మాజీ అధ్యక్షుడు మీసాల ప్రభుదాస్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జలగం డేవిడ్ రాజు, ప్రధాన కార్యదర్శిగా కేశవరపు కరుణాకర్, కోశాధికారిగా రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూజర్ల సామ్యూల్ కిరణ్, ఉపాధ్యక్షులుగా కోక యేసు రత్నం, బొడ్డు ముత్తాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొర్నేలి పాల్ పాల్వాయి, సహాయ కార్యదర్శిగా కోదూరి ఎజ్రా, సహకోశాధికారిగా ప్రసన్నకుమార్, మీడియా కన్వీనర్ గా మచ్చ ఏసు పాదం, సహకన్వీనర్ గా కందుకూరి ఏసు రాజు, సభల కన్వీనర్గా లక్ష్మీ శెట్టి ప్రేమ్ కుమార్, కో కన్వీనర్ గా కర్నే మని దాసు, ప్రేయర్ కన్వీనర్ గా నిమ్మనగోటి ఏరియా, కో కన్వీనర్ గా జాన్ పాల్, కల్చరల్ కన్వీనర్ గా జనార్దన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా వీరేష్, దుర్గాప్రసాద్, నగేష్ లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మామిడి సామ్సన్, కాసర్ల శ్రవణ్ కుమార్, దామెర్ల పాల్, సాయిని జాకబ్, జోహార్ పాల్, లేజర్ నాయక్, మరియన్న, సుదర్శన్, డానియల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి



మాట్లాడుతున్న నరేందర్

భానుపురి (సూర్యాపేట): దేశంలో 60 శాతంగా ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా పోయిందని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారని తెలంగాణ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం సూర్యాపేటలో ఆయన మాట్లాడారు. బీసీలు అన్ని రంగాల్లో చెందేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో రాజు, భిక్షపతి గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

పెన్‌పహాడ్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి కోరారు. బుధవారం మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొండేటి రాములు, సీనియర్ నాయకులు గోగుల సోమయ్య, చెన్ను ఎలమందమ్మ, కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరబోయిన రవి

గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోవాలి



వర్ధమానుకోటలో నూతన గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీనివాస్

నాగారం: నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోవాలని ఎంపీఓ ధార శ్రీనివాస్ సూచించారు. బుధవారం నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామపంచాయతీని ఆయన సందర్శించి గ్రామంలో పారిశుద్ధ్యం, నూతన గృహ నిర్మాణాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామంలో పర్యటిస్తూ అనుమతి లేని నూతన గృహనిర్మాణాలను గుర్తించి అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటికి ఇంకుడుగుంత ఉంటేనే అనుమతి ఉంటుందని అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు పరిశీలించారు. ఇంటిపన్ను తప్పనిసరిగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జాజిరెడ్డిగూడెంలో కేంద్ర పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

అర్వపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్, నోడల్ అధికారి బదావత్ రామకృష్ణ కోరారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా జాజిరెడ్డిగూడెంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా బీమా పథకాలు, ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి వై.సురేంద్ర, ఆరోగ్యమిత్ర శ్రీరంగం రమేష్, వైద్యాధికారి డాక్టర్ నగేష్, ఏఎన్‌ఎంలు గిరిజ, సైదమ్మ, సూపర్‌వైజర్ కిరణ్, ఆశా కార్యకర్తలు పద్మ, నాగమ్మ, సైదమ్మ, వసంత, ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శారీరక ధృఢత్వానికి క్రీడలు దోహదం




విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీకాంత్‌రాజ్

నూతనకల్: క్రీడలు శారీరక ధృడత్వానికి దోహదపడతాయని ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ అన్నారు. నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్లలో పెరియార్ క్రికెట్‌లీగ్ సీజన్- 2లో భాగంగా గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సంక్రాంతి క్రీడోత్సవాల్లో విజేతలకు బహుమతుల ప్రదానంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో విద్యాసాగర్, జైపాల్‌నాయక్, ఆచారి, సుధాకర్, నాగమల్లు, వెంకన్న, తిరుమలేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్వపల్లి దేవాలయంలో ఇరుముడి మహోత్సవం

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప, హనుమాన్ మాలధారులు ఇరుముడి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు ఆలయంలో ఇరుముడులు కట్టుకొని శబరిమలై, కొండగట్టు ఆలయాలకు వెళ్లారు. కార్యక్రమంలో స్వాములు డాక్టర్ జేరుపోతుల లక్ష్మణ్, సోమయ్య, గజ్జి శంకర్, పసుల మల్లేష్, కనుకు భద్రి, పులకరం నాగయ్య, ఉప్పు సత్యనారాయణ, బైరబోయిన భూమయ్య, యాదగిరి, శిగ రవి, కనుకు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సయ్యద్‌రన్‌మియా

మఠంపల్లి : ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల సర్వీస్‌లను రెగ్యులర్ చేయాలని, మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించాలని, అంగన్‌వాడీ, హమాలీలు, పాఠశాలల స్వీపర్లు తదితర రంగాల వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లింగమ్మ, మైసయ్య, గురువారెడ్డి, దేవదానం, లాలాసాహెబ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్దిరాల: మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామంలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్‌ఐ నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ పోన్న పద్మయ్య రేపోని గ్రామానికి చెందిన వెలిశాల నర్సయ్య కోళ్ల ఫామ్‌లో దాణా కోసం రేసు వెంకన్నకు చెందిన ట్రాక్టర్ ద్వారా దాదాపు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. సమాచారం మేరకు బియ్యాన్ని పట్టుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నాగయ్య తెలిపారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

తుంగతుర్తి: పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) వేయించాలని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రవిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా 31వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్, మమత, సుష్మ, బుచ్చిబాబు పాల్గొన్నారు.



పశువైద్యశాలలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశువైద్య సంచాలకులు రవిప్రసాద్

అందరికీ ఆరు గ్యారంటీలు

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తిరుమలగిరి (తుంగతుర్తి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం చింతలకుంట తండా, మర్రికుంటతండా నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు త్వరలోనే రూ.1,00,116తోపాటు తులం బంగారం కూడా అందిస్తామని తెలిపారు. మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని రోడ్లు అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ప్రతి తండాకు పక్కా రోడ్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, వైస్ ఎంపీపీ బొడ్డు సుజాత, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, సర్పంచ్‌లు రవీందర్, దేవానాయక్, మండల తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, పీఆర్‌ఏఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం తొండ గ్రామంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు, మండల అధ్యక్షుడు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, నాగరాజు, అరవింద్‌రెడ్డి, రామాంజయ్య, హఫీజ్, కందుకూరి లక్ష్మయ్య, తిరుమని యాదగిరి, బత్తుల శ్రీను, రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయ్య మృతికి సంతాపం

మద్దిరాల : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన మోడెం ధర్మయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బుధవారం స్థానికంగా నిర్వహించిన ఆయన దశదిన కర్మలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ధర్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, గ్రామ శాఖ అధ్యక్షుడు వినోద్, మోడెం శ్రీలత ఉపేందర్, హమీద్, మహేష్, సూరి, సందీప్, సాయి తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట): ఆత్మకూర్ మండలం ఏపూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రావుల లింగయ్య, షేక్ ఇసూబీలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ దామిడి రమేష్‌రెడ్డి, బుడిగే లింగయ్య, దామిడి రాజు, చిట్టి, లాలు తదితరులున్నారు.



లింగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

అయోధ్య రామాలయ అక్షింతల పంపిణీ



నాగారం: పేరబోయినగూడెంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు



మద్దిరాల: కుక్కడం గ్రామంలో ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న అర్చకుడు వరదాచార్యులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామంలో బుధవారం అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జేరుపోతుల లక్ష్మణ్, దాసంయాదగిరి, అయోధ్య, చింతల అవిలయ్య, అంకిరెడ్డి ముత్తయ్య, ఎ. యాదగిరి, ఎ. వెంకన్న, శ్రీను, కేసాని నవీన్, కోనేటి వెంకటేశ్వర్లు, పసుల మల్లయ్య, బొడ్డు సైదులు పాల్గొన్నారు.

పేరబోయినగూడెంలో

నాగారం: అయోధ్య అక్షింతలను ధర్మా జాగరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాగారం మండల పరిధిలోని పేరబోయినగూడెం గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు వేణుశాస్త్రి, సతీష్, వెలుగు రమేష్, ప్రశాంత్, శిరస్సు వెంకన్న, కొమిరెల్లి పాల్గొన్నారు.

కుక్కడం గ్రామంలో

మద్దిరాల: మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో హిందూ ధర్మకర్తల ఆధ్వర్యంలో బుధవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అక్షింతలతోపాటు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు వరదాచార్యులు, బొమ్మెర వెంకన్న, మద్దెల భిక్షపతి, బీసు చిన్న వీరన్న, చామరి లింగయ్య, మద్దెల కాశీం, మద్దెల రాములు, మర్రి పెద్దఉప్పలయ్య, చిన్న ఉప్పలయ్య, శిలివేరు చిరంజీవి, బీసు పెద్ద వీరన్న, బింగి సోమయ్య, శిలివేరు రాము, శిలివేరి సతీష్, బీసు రవి, దళపతి, కిషోర్, లింగయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



ప్రమాదకరంగా ఉన్న మద్దిరాల-ముకుందాపురం ప్రధాన రహదారి

- ఏర్పాటు చేయని సూచిక బోర్డులు
- రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



గుమ్మడవెల్లి నుంచి తూర్పుగూడెం వెళ్లేదారిలో..

మద్దిరాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో పలుచోట్ల మూలమలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. ప్రమాద హెచ్చరికలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా గుమ్మడవెల్లి నుంచి తూర్పుగూడెం వెళ్లేదారిలో 12చోట్ల, గుమ్మడవెల్లి నుంచి కర్విరాల రోడ్డుకు వెళ్లే రహదారిలో ఆరు చోట్ల, మద్దిరాల నుంచి ముకుందాపురం వెళ్లే దారిలో ఆరు చోట్ల, గోరెంట్ల రోడ్డులో ఐదు చోట్ల మూలమలుపులు ఉన్నాయి. ఈ మలుపుల్లో రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మద్దిరాల నుంచి ముకుందాపురం, గుమ్మడవెల్లి నుంచి తూర్పుగూడెం వెళ్లే దారిలో అనేక చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారుల వెంట నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– చామకూరి లింగయ్యగౌడ్, కుక్కడం గ్రామం

కంప చెట్లు తొలగించాలి



గుమ్మడవెల్లి గ్రామం నుంచి తూర్పుగూడెం, కర్విరాలకు వెళ్లే రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు అల్లుకుపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలి.

– ఎస్‌కే హమీద్, గుమ్మడవెల్లి గ్రామం